
వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 288 బుధవారం | 29 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

## ధార్మిక భవనం ఆక్రమించేందుకు కుట్రలు

సమ్మక్క సారలమ్మ పూజారుల ఆందోళన
గద్దెలకు తాళం వేసి నిరసన



8 లో..

# ఛీ.. కంపు
# బాబోయ్ డంపు..



వివరాలు 2లో..

### పొగతో ఉక్కిరిబిక్కిరి
### ఆవాసాల సమీపంలోనే డంపింగ్ యార్డ్
### దుర్గంధానికి కేరాఫ్ అడ్రస్
### మార్చాలంటూ తండా వాసుల వేడుకోలు

పల్లెల్లో పరిశుభ్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెత్తను సేకరించడానికి ట్రాక్టర్లు కొనడంతో పాటు డంపింగ్ యార్డులను నిర్మించింది. అయితే మరిపెడ పట్టణం మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. కొత్తకొత్త కాలనీలు, నివాస ఏరియాలు పెరుగుతున్నా ఇక్కడి డంపింగ్ యార్డ్ మాత్రం దుర్గంధానికి కేరాఫ్ అడ్రస్ గా మారింది. మరిపెడ మునిసిపాలిటీగా ఏర్పాటు కాకముందే ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు మాత్రం అప్పటికంటే మరీ అధ్వానంగా తయారైంది. తడి, పొడి చెత్త వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యం దేవుడెరుగు.. కనీసం కంపు వాసన రాకుంటే బాగుండు అన్న భావన ఇక్కడి ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఎన్నో ఏళ్లనుంచి చెత్త పేరుకుపోవడంతో చినుకు పడిందంటే చాలు ఇక్కడినుంచి వచ్చే దుర్వాసనతో డంపింగ్ యార్డు చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వారి ముక్కుపుటాలు అదరాల్సిందే. నగరం నడిబొడ్డున ఉన్న ఈ డంపింగ్ యార్డును శివారులోకి మార్చాలన్న ప్రతిపాదన కొన్నేళ్లుగా వస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో ముందుకు సాగడంలేదు. చినుకులు పడకముందే మునిసిపాలిటీ అధికారులు తగిన చర్యలు తీసుకొని డంపింగ్ యార్డును తరలించాలని స్థానికులు వేడుకుంటున్నారు. - వరంగల్ వాయిస్, మరిపెడ




8లో

## సేవాలాల్ మార్గం అనుసరణీయం

ఆయన దీవెనలు రాష్ట్ర ప్రజల మీద ఉండాలి
రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

## రాష్ట్ర చిహ్నం మార్పుపై బీఆర్ఎస్ సీరియస్

ఖిలాలో మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఆధ్వర్యంలో ధర్నా



8లో..



2లో

## పోలీసుల ప్రతిష్టను దిగజార్చొద్దు

గీత దాటితే వేటు తప్పదు
వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

# ఛీ కంపు

## బాబోయ్ డంపు..



**పొగతో ఉక్కిరిబిక్కిరి**

**ఆవాసాల సమీపంలోనే డంపింగ్ యార్డ్**

**దుర్గంధానికి కేరాఫ్ అడ్రస్**

**మార్చాలంటూ తండా వాసుల వేడుకోలు**

**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ పట్టణంలోని డంపింగ్ యార్డ్ అధ్వానంగా తయారైంది. ఇక్కడినుంచి వెదజల్లుతున్న దుర్గంధంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భరించలేని కంపుతో ఆందోళనకు గురవుతున్నారు. డంపింగ్ యార్డ్ నుంచి వస్తున్న పొగ తండా ప్రజలకు ఊపిరి ఆడకుండా చేస్తోంది. ఈ పొగ మరిపెడ పట్టణాన్ని మొత్తం కమ్మేస్తోంది. ఈ పొగతో ఊపిరి ఆడక ప్రాణాలు గాలిలో కలిసిపోయేలా ఉన్నాయి. మునిసిపాలిటీ ఏర్పాటు కాక ముందునుంచే పట్టణంలోని 9 వార్డు కున్యాతండా సమీపంలో డంపింగ్ యార్డ్ కొనసాగుతోంది. కొన్నేళ్లుగా ఇక్కడే చెత్త డంప్ చేయడంతో గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. దీంతో చెత్త కుళ్లిపోయి వర్షాకాలంలో దుర్గంధం వెదజల్లుతోందని చుట్టుపక్కల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### చెత్తకు నిప్పు..

గుట్టలుగా పేరుకుపోయిన చెత్తకు మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో కున్యా తండాను పొగ కమ్మేసంది. ఈ పొగ మరిపెడలోని సగానికిపైగా ప్రాంతాల్లో విస్తరించింది. దీంతో కున్యా తండా ప్రజలే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాలవారు ఊపిరాడక ఇబ్బందులకు గురియ్యారు. బుధవారం తండా ప్రజలు అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. మునిసిపాలిటీ అధికారుల పనితీరును ఎండగట్టారు. దీంతో స్పందించిన అధికారులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అర్పించారు. కున్య తండాను డంపింగ్ యార్డ్ నుంచి వస్తున్న పొగ, దుమ్ము, ధూళితో కూడిన విష వాయువులను పీల్చడం ద్వారా తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండావాసులను అధికారులు, రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదని మండి పడుతున్నారు.



### కున్యా తండా సమీపంలో డంపింగ్ యార్డ్

మరిపెడ పట్టణంలోని కున్యా తండా సమీపంలో డంపింగ్ యార్డుకు కొన్నేళ్లుగా టన్నుల కొద్ది చెత్తను డంపింగ్ చేయడంతో యార్డులో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. డంపింగ్‌యార్డు ప్రారంభించే సమయంలో ఇక్కడ పదిరోజుల చెత్తకూడా నిల్వకాకుండా చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేశారు. తడి చెత్త, పొడి చెత్తను ఇక్కడ వేరుచేయడంతోపాటు పొడిచెత్తను రీసైక్లింగ్ చేసి పనికివచ్చే వస్తువులను విక్రయించాలని, తడిచెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి విక్రయించాలని సంకల్పించారు. అందుకనుణంగా కంపోస్టు ఎరువు తయారీ ఫ్లాంట్‌ను కూడా నెలకొల్పారు. ఇటు చెత్త తరలింపు, అటు కంపోస్టు ఎరువు కొనుక్కుని వెళ్లేవారికి కూడా అందుబాటులో ఉంటుందని అప్పట్లో పట్టణానికి అతి సమీపంలో ఈ డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. అనంతర కాలంలో డంపింగ్ యార్డులో తడి చెత్త, పొడిచెత్త వేరుచేయడం కాకుండా ఇళ్ల వద్దే ఆ ప్రక్రియ జరిగితే బాగుంటుందని ఇంటింటికీ రెండేసి బుట్టలు సరఫరాచేసి తడిచెత్త, పొడిచెత్తలను వేర్వేరుగా సేకరించడం ప్రారంభించారు. అయితే అవన్నీ మూడునాళ్ల ముచ్చటగానే మారాయి. డంపింగ్ యార్డులో మంచినీటి సౌకర్యం, కనీస సౌకర్యాలతో పాటు ప్రహరీ లేక పోవడంతో చెత్తనుంచి కంపోస్టుఎరువు తయారీ ఫ్లాంట్ కూడా మూలన పడింది. దీంతో డంపింగ్‌యార్డులో చెత్త కొండల్లా పేరుకుపోతోంది. ఆ చెత్త కొండలు కరగకపోతే కొత్తగా చెత్తవేసే అవకాశం కూడా లేని పరిస్థితి నెలకొంటోంది. దుర్వాసనతో పాటు పొగ ఇక్కడి ప్రజలను రోగాలపాలు చేస్తోంది.

### దూరంగా ఏర్పాటు చేయాలి..

డంపింగ్‌యార్డును కున్యా తండా నుంచి తొలగించి పట్టణానికి దూరంగా తరలించాలని కొన్నేళ్లుగా తండా ప్రజలు గగ్గోలు పెడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు తగినచర్యలు చేపట్టి డంపింగ్‌యార్డును పట్టణానికి దూరంగా తరలించి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. డంపింగ్ యార్డును అక్కడి నుంచి మార్చాలని ప్రజలు గతంలోనే కలెక్టర్, ఎమ్మెల్యేతో పాటు స్థానిక అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసిన ఫలితం లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో మునిసిపల్ అధికారులు చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

# పోలీసుల ప్రతిష్టను దిగజార్చొద్దు

**గీత దాటితే వేటు తప్పదు**

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రతిష్ఠను దిగజార్చే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తే సహించేది లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులతో బుధవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్న ఈ సమావేశంలో శాంతి భద్రతలకు సంబంధించి పలుఅంశాలపై సీపీ వారితో చర్చించారు. జూన్ 4న ఏనమాముల మార్కెట్ లో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు సజావు నిర్వహించేందుకుగా తీసుకోవాల్సిన చర్యలపై వారికి దిశానిర్దేశం చేశారు. అదే విధంగా జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షల బందోబస్తుపై వారితో చర్చించారు. వర్షాకాలం సమీపిస్తున్న వేళ రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా స్థానిక పోలీసులు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

### నిజాయితీతో వ్యవహరించాలి..

అనంతరం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించే ప్రతి పోలీస్ అధికారి నీతి, నిజాయితీతో వ్యవహరించాలని సూచించారు. ప్రతీ ఒక్కరు సమయపాలన పాటిస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలనుంచి వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. పోలీసులపై ప్రజలకు ఉన్న నమ్మకానికి తగ్గట్టుగానే సాధరణ ప్రజలకు సరైన న్యాయం అందించాలని అప్పుడే పోలీసు వ్యవస్థకు సమాజంలో పేరు ప్రతిష్ఠలు, గౌరవం పెరుగుతుందన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా ప్రజలు ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, మీ ఫిర్యాదుపై సరైన న్యాయం జరగని పక్షంలో మాత్రమే ఉన్నతాధికారులను ఆశ్రయించాలన్నారు. ముఖ్యంగా పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేయాలనుకునేవారు 8712685070 వాట్సప్ నంబర్‌కు మీ ఫిర్యాదులను పోస్ట్ చేయడం ద్వారా వాటిపై తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశం అనంతరం పార్లమెంట్, ఉప ఎమ్మెల్సీ ఎన్నికలను సజావు నిర్వహించడంలో విశేష కృషి చేసిన పోలీస్ అధికారులకు సీపీ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందజేసారు. ఈ సమావేశంలో డీసీపీలు అబ్దుల్‌బారీ, రవీందర్, ఏఎస్పీ అంకిత్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# కేయూ సమస్యలు పరిష్కరించాలి

**వీసీకి విద్యార్థి సంఘాల వినతి**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ ఎఫ్ ఐ, బీఎస్ ఎఫ్, ఎస్ ఎస్ యూ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి వీసీ వాకాటి కరుణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, బిఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి కల్లేపల్లి ప్రశాంత్, ఎస్ ఎస్ యూ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో గత కొంత కాలంగా పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారం చూపించాలని కోరారు. పెంచిన పీహెచ్డీ కోర్స్ ఫీజులను వెంటనే తగ్గించాలని, రూసా నిధులు పరిశోధన కోసం కేటాయించాలని, యూనివర్సిటీలోని అన్ని విభాగాలను డిజిటలైజేషన్ చేయాలని, యూనివర్సిటీ భూమిని ఖబ్జా చేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఇంజినీరింగ్ విధ్యార్థులకు కాలేజీ నుంచి హాస్టల్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని, యూనివర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. అలాగే యూనివర్సిటీ లైబ్రరీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు స్టాలిన్, రాజిరెడ్డి, ప్రదీప్, సాయి, కోబ్లర్, నవీన్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా పరపతి సంఘాలతో ఆర్థిక పరిపుష్టి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళలు ఆర్థికంగా బలపడాలంటే మహిళా పరపతి సంఘాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. భవాని మహిళా సంక్షేమ మండలి అధ్యక్షరాలు అవునూరి కోమల అధ్యక్షతన జరిగిన 4 వ వార్షికోత్సవానికి 40వ డివిజన్ కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి రోజులలో ఆర్థిక సమస్యలతో అనేకమంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి ఇబ్బందులను తప్పించుకోవడానికి, ఎటువంటి ఆస్తుల దస్తావేజులు లేకుండా బేషరతుగా పరపతి సంఘాలు అప్పులు ఇస్తున్నాయన్నారు. అటువంటి అప్పులు పొందిన సభ్యురాలు క్రమం తప్పకుండా ప్రతినెల షేర్స్ అప్పు రూపాయలు చెల్లించాలని ఆయన సభ్యులను కోరారు. ఈ సమావేశంలో శాంభవి మహిళ సంక్షేమ మండలి అధ్యక్షురాలు మాడిశెట్టి కవిత, భవాని మహిళా సంక్షేమ మండలి అధ్యక్షురాలు అవునూరి కోమల, ప్రధాన కార్యదర్శి దాసరి సరిత, కోశాధికారి అవునూరి సునీత, కటకం రాధిక, నర్ర సంధ్య, అంజలి, నాంపల్లి సునీత, తాళ్లపల్లి వాసవి, అన్నం రజిత, చెలుపూరి మంజుల పాల్గొన్నారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని భద్రకాళి అమ్మవారిని బుధవారం కుటుంబ సమేతంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి దర్శించుకున్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఝాన్సి రాజేందర్ రెడ్డిలు భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని గొల్ల కురుమలు రెండో విడత గొర్రెలు పంపిణీ కోసం తమ వాటా ధనాన్ని ప్రభుత్వానికి డీడీల రూపంలో అందజేశారు. వారికి ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమం చేయవలసిందిగా బుధవారం వరంగల్ జిల్లా పశు వైద్య పశుసంవర్ధక శాఖ అధికారి కార్యాలయంలో గొర్రెల పెంపకం దారుల జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ జిల్లా డైరెక్టర్ పరకాల పీఏసీఎస్ చైర్మన్ గుండెబోయిన నాగయ్య, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి, లక్ష్మీపురం మాజీ ఎంపీటీసీ బండారి నారాయణ, గొర్రెల పెంపకం దారుల కమిటీ నాయకులు, గొల్ల కురుమలు తదితరులు పాల్గొన్నారు.

# విత్తన కొనుగోలుపై అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని వావిలాల గ్రామంలో వర్షాకాలంలో విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నెల్లికుదురు మండల వ్యవసాయ అధికారి నేలకుర్తి రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల క్లస్టర్ ఏఈఓలు మాట్లాడుతూ రైతులు పత్తి పంటను సాధారణ పద్ధతిలో కాకుండా నూతన పద్ధతిలో సాగు చేసుకోవాలని సూచించారు. స్వల్పకాల వ్యవధికి సంబంధించిన పంట సాగును నిర్వహించుకోవాలని, తద్వారా పత్తి సాగులో ఎక్కువగా సంభవించే గులాబీ పురుగు తెగులు నుంచి బయటపడవచ్చునని తెలిపారు. తద్వారా, రైతులు రెండో పంటకు వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ అధిక సాంద్రత విధానంలోప్రతి సాలుకు రెండున్నర అడుగుల వ్యత్యాసం ఉండాలని సూచించారు. ప్రతి మొక్కకు అర ఫీటు వ్యత్యాసం ఉండాలన్నారు., సాధారణ పద్ధతిలో అయితే ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది వేల మొక్కలు నాటితే ఈ పద్ధతి ద్వారా 18 నుంచి 20 వేల మొక్కలు నాటవచ్చునని సూచించారు. మొక్కలు ఎక్కువ ఎత్తు పెరగకుండా 40 రోజులకు ఒకసారి, 65 రోజులకు, ఒకసారి చొప్పున, మెఫీ క్యాట్ క్లోరైడ్ ను పిచికారి చేయడంతో మొక్కలు భారీ ఎత్తున పెరగకుండా తొందరగా పూతకాతకు రావడం జరుగుతుందన్నారు. విత్తనాలు కొనే ముందు లైసెన్స్ గల డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయడమే కాకుండా విడి విత్తనాలను, సీల్ లేని విత్తనాలను కొనుగోలు చేయకూడదని సూచించారు. ఏ డీలర్ వద్దనైతే పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తారో ఆ విత్తనాలకు కంపెనీకి సంబంధించిన పేరును రశీదులో పొందుపరిచారా లేదా సరిచూసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్ పై ఉన్న ఎమ్మార్పీకి మించి ధర చెల్లించకూడదన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆలేరు గ్రామ క్లస్టర్ ఏఈఓ శిరీషతో పాటు చిన్న ముప్పారం క్లస్టర్ ఏఈఓ ముజాహిద్, చిన్న నాగారం క్లస్టర్ ఏఈఓ సుమన్, మునిగలవేడు క్లస్టర్ ఏఈఓ కళ్యాణి, ఎర్రబెల్లిగూడెం క్లస్టర్ ఏఈఓ చందన, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

### వరంగల్ వాయిస్ కథనంపై స్పందన



**వరంగల్ వాయిస్, పరకాల :** నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న గృహ నిర్మాణాలపై చర్యలు చేపట్టనున్నట్లు పరకాల మున్సిపల్ కమిషనర్ నరసింహ తెలియజేశారు. అక్రమ గృహ నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారికి సైతం మెమో జారీ చేయనున్నట్లు వెల్లడించారు. పరకాల కేంద్రంగా అక్రమ గృహ నిర్మాణాల విషయమై వరంగల్ వాయిస్ కథనాలు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ కథనాలకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులను అక్రమ గృహ నిర్మాణాలపై నివేదిక ఇవ్వాలంటూ ఆదేశించినట్లు తెలుస్తుంది. విచారణకు వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా గృహ నిర్మాణం చేపడుతున్న విషయం వాస్తవ ఆధారాలతో నివేదిక రూపొందించినట్లు సమాచారం. అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించిన కమిషనర్ మార్కెట్ రోడ్డులోని అనుమతులకు విరుద్ధంగా జీ ప్లస్ 4 నిర్మిస్తున్న గృహాన్ని కూల్చివేయనున్నట్లు వెల్లడించారు. పరకాల పట్టణంలో అక్రమ నిర్మాణలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు చేపడతామని తెలిపారు. అంతేకాకుండా అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన టౌన్ ప్లానింగ్ అధికారి రాజుకు మెమో జారీ చేసి వివరణ కోరనున్నట్లు వెల్లడించారు.

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ద్వారా భూగర్భ జలాలు పెంచుకోవచ్చని జీవ వైవిధ్య పరిరక్షణ కమిటీ సభ్యులు దైవ వెంకన్న అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో జీవ వైవిధ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలు నిర్మించాలి.. మొక్కలు నాటాలంటూ అవగాహన ర్యాలీని నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. చెట్లు మానవాళికి ప్రాణవాయువు అందించస్తాయని, మొక్కలు నాటి భావితరాలకు కానుకగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యులు నరసింహారావు, మల్లేశం వెంకటయ్య, దైద వెంకన్న, పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# కల్తీ విత్తనాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### న్యూ డెమోక్రసీ, ఏఐకేఎంఎస్ ధర్నా



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** కల్తీ విత్తనాలను అమ్ముతున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని, క్రిమిసంహారక మందుల కల్తిని అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ ను దొడ్డు రకం వడ్లకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం నర్సంపేట ఆర్డీఓ ఆఫీస్ ముందు సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ల ఆధ్వర్యంలో రైతుకూలీలు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైందంటే విత్తనాల కల్తీమయం జరుగుతున్నదని, దీనిని అరికట్టడంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా విత్తనాల షాపులపై తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్ని రకాల విత్తనాలపై 75 శాతం సబ్సిడీ అందించాలని ఆయన కోరారు. న్యూ డెమోక్రసీ డివిజన్ సెక్రెటరీ ఎలకంటి రాజేందర్ మాట్లాడుతూ ఒకేసారి రెండు లక్షల రుణమాఫీని చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించి అమలు చేయకుండా ఆగస్టు 15 వాయిదా వేసిందని విమర్శించారు. ఇది రైతులు నిరాశపరిచిందని, వెంటనే రుణమాఫీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పంటలకు ముందుగానే ప్రణాళిక తయారుచేసి అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, గంగుల దయాకర్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టి కృష్ణ, జక్కుల తిరుపతి, జిల్లా నాయకులు భోగి సారంగపాణి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పూలక్క సంధ్య, పీవైఎల్ జిల్లా నాయకులు గంద్రతి హరిబాబు, మల్లయ్య, వెంకట్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సాంబయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను మోసం చేస్తున్న ఆల్ఫోర్స్

**అనుమతి లేని కాలేజీని మూసివేయాలి**

**కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తున్న అధికారులు**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కార్పొరేట్ విద్యాసంస్థలకు ఇంటర్మీడియట్ అధికారులు కొమ్ము కాస్తున్నారని, నగరం నడిబొడ్డున పోచమ్మ మైదాన్ లో అనుమతి లేకుండా జూనియర్ కాలేజీని ఏర్పాటు చేసి అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ ఆరోపించారు. అనుమతి లేని కాలేజ్ ని మూసివేయాలని, బానర్లు, కరపత్రాల ద్వారా ప్రచారాన్ని ఆపాలని ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకున్నా అడ్మిషన్లు తీసుకుంటున్నారని, విద్యార్థుల భవిష్యత్ తో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఆల్ఫోర్స్ కళాశాలపై ఇంటర్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, పోస్టర్లను తొలగించాలని లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ కళాశాలల, పాఠశాల మీద విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. వరంగల్ నగరంలో పలు ప్రైవేట్ కళాశాలకు పర్మిషన్లు, షిఫ్టింగ్ పర్మిషన్ లేకుండా ప్లెక్సీలు కట్టి విద్యార్థులను మోసం చేస్తున్నారని, ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు చెప్పినా కూడా స్పందన లేదని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికా రులు మేల్కొని పర్మిషన్ లేని విద్యాసంస్థలకు నోటీసులు ఇష్యూ చేసి తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ వరంగల్ మండల నాయకులు సూర్య వంశీ, శ్రావణ్ శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక పర్మిషన్ రద్దు చేయాలి

**పొలాలు ఎడారిగా మారుతాయని రైతుల ఆందోళన**



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని గొల్లపల్లి గ్రామం వాగు నుంచి పాలకుర్తి రిజర్వాయర్ కు ఇసుక రవాణాను రైతులు అడ్డుకున్నారు. ఈ ఇసుకను రిజర్వాయర్ కు ఇసుక తరలిస్తే వాగు పరిసర ప్రాంత రైతుల పొలాలు ఎడారిగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇచ్చిన పర్మిషన్ ను కలెక్టర్ వెంటనే పర్మిషన్ రద్దు చేయాలని, స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ ఇసుక పర్మిషన్ ను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ప్రజల అవసరాల ఇంటి నిర్మాణం కోసం అభివృద్ధి పనులు, సీసీ రోడ్లకు గ్రామంలోని అవసరాలకు పర్మిషన్ ఇవ్వని అధికారులు ఇప్పుడు ఏ విధంగా రిజర్వాయర్ కు పర్మిషన్ ఇచ్చారని ప్రశ్నించారు. ఈ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా గతంలో గుర్తించిన అధికారులు మళ్లీ ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక పర్మిషన్ ఇవ్వడం ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై విచారణ



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండలంలోని పంథిని గ్రామంలో ఉన్న హర్షణపల్లి శ్రీరాం భూపాల్ వెలమ సామాజిక వర్గానికి చెందిన అలియాస్ కన్నారావుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కావడంతో మామునూరు ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో ఐనవోలు ఎస్సై అనిల్ కుమార్ సంఘటన ప్రదేశానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆ సమయంలో చుట్టుపక్కల వారు కూడా విచారణ సమయంలో ఏసీపీకి సహకరించారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ



**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** దామెర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త జయపాల్ రెడ్డి ప్రమాదవశాత్తూ మరణించారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ప్రమాద భీమా ద్వారా మంజూరైన 2 లక్షల విలువైన చెక్కును నామినీగా ఉన్న ఆయన భార్య లక్ష్మికి వారి కుటుంబసభ్యుల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్, వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్ అందజేశారు.

## ఘనంగా కొండా దంపతుల వివాహ వార్షికోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ కొండా సురేఖ మురళీధర్ రావు వివాహ వార్షికోత్సవ సందర్భంగా శ్రీ కనకదుర్గ దేవాలయ కమిటీ అధ్యక్షుడు టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గంలోని నర్సంపేట్ రోడ్డులో గల శ్రీ కనకదుర్గ మాత దేవాలయంలో కొండా దంపతుల పేరు మీద అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొండా దంపతులు ఆయురారోగ్యాలతో ఉండి నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేయాలని ఆ కనకదుర్గమ్మ తల్లిని వేడుకొంటూ ఆలయ అర్చకులు నాని శర్మ పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు లడ్డు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కొండా దంపతుల అభిమానులు వారి వివాహ వార్షికోత్సవ సందర్భంగా అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కొండా దంపతులు ఆయురారోగ్యాలతో ఉండి నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేసే భాగ్యం ఆ భగవంతుడు కల్పించాలని కోరుకున్నారు. కొండా దంపతులు అంటే ఆపదలో ఉన్న ఎవరికైనా, నమ్ముకున్న వారికి సహాయ సహకారాలు చేస్తారని తెలిపారు. కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పప్పు వేణు, సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వరియా సురేష్ కుమార్, జంగం ప్రభాకర్, రజిత, గూడ శారద, పప్పు విజయ, కొప్పుల శేఖర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, గుల్లపల్లి రామకృష్ణ, కొండమీది సదానందం, గుందం సురేందర్, పూణేరియా మనోజ్ కుమార్, గూడ వీరలక్ష్మి, గూడ రమ్య, కాశ శ్రీదేవి, కోటేశ్వర్, కుమార్ స్వామి నాయక్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### పండ్ల పంపిణీ..



చిరు వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ స్టేషన్ దగ్గర మంత్రి కొండా సురేఖ-మురళీధర్ రావు దంపతుల పెళ్లి రోజును పురస్కరించుకొని పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరువ్యాపారాస్తుల సంఘం అధ్యక్షులు గజ్జెల లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి గడ్డం సుధాకర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు భాషపాక సదానందం, కాల్ నాయక్, కరాటే ప్రభాకర్, సంగరబోయిన చందర్, సింగిరెడ్డి ఉపేందర్, ఈరమ్మ బేగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గజ్జెల లింగమూర్తి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు- రాష్ట్ర మంత్రి కొండా సురేఖల పెళ్లి రోజు వరంగల్ తూర్పులో పండుగ రోజు అంటూ.. ఈ జంట నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కొండా దంపతుల ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు అభివృద్ధిలో ముందుకు సాగుతుందని తెలిపారు.

## వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలి

**రేగొండ సెకండ్ ఎస్ఐ శ్రీలత**



**వరంగల్ వాయిస్, రేగొండ :** వాహనదారులు తప్పనిసరిగా సరైన ధృవ పత్రాలు కలిగి ఉండాలని రేగొండ సెకండ్ ఎస్ఐ శ్రీలత అన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రేగొండ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర భూపాలపల్లి పరకాల ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ ప్రతీ ఒక్క వాహనదారులు కచ్చితంగా సరైన వాహనాల పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ ఇతర పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలి, ప్రతీ వాహన దారుడు ట్రాఫిక్ నియమాలు తెలిసి ఉండాలన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించి వాహనాలు నడపాలని, లేదంటే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం చాలా ఉంటుందన్నారు. ఎదుటి వారి ప్రాణాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది, కాబట్టి, ప్రతీ వాహనదారుడు నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. అనవసరంగా ఇతరుల ప్రాణాలు, మీ ప్రాణాలు తీసుకొని కుటుంబ సభ్యులకు తీవ్ర విషాదం మిగిల్చవద్దని శ్రీలత కోరారు. ఎస్ఐతో పాటు ఏఎస్ఐ, కానిస్టేబుల్, సిబ్బంది ఉన్నారు.

## అన్నదానానికి దాతల విరాళం



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** హనుమాన్ మాల ధారణ వేసుకున్న స్వాములకు శ్రీ భక్తాంజనేయ కుటీరం స్వాములు 41 రోజుల నిత్య అన్నదానం చేస్తున్నారు. ఈ గొప్ప కార్యక్రమానికి తమ వంతు సాయంగా ముందుకు వచ్చిన శ్రీ బాలాజీ మార్బుల్ అండ్ శ్రీ తేజ టైల్స్ ప్రోప్రైటర్ గిరిధర్ చారి రూ.35 వేల విరాళం అందజేశారు. అలాగే, హనుమకొండకు చెందిన డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి రూ.35 వేలు విరాళం అందించారు. దాతలు ముందుకు వస్తున్న వేల మరో గొప్ప కార్యక్రమానికి శ్రీ భక్తాంజనేయ కుటీరం స్వాములు జూన్ 1న శ్రీ హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మహా అన్నదానం చేయాలని నిర్ణయించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సహాయ సహకారాలను అందిస్తున్న ప్రతి ఒక్కరికి పేరుపేరున శ్రీ భక్తాంజనేయ కుటీరం స్వాములు కృతజ్ఞతలు తెలిపారు.

## దేవాదుల పనులను త్వరగా పూర్తి చేయండి

**మంత్రి ఉత్తమ్‌ను కోరిన కడియం శ్రీహరి, కావ్య**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని హైదరాబాద్ లోని వారి నివాసంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా తో సత్కరించారు. అనంతరం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న దేవాదుల ప్రాజెక్టు పనులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చర్చించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీటిని అందించటానికి దేవాదుల ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాబట్టి, ప్రత్యేక చొరవ తీసుకోని చర్యలు చేపట్టాల్సిందిగా మంత్రికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దేవాదుల పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

# గొల్ల కురుమలను మోసం చేసిన కాంగ్రెస్
## మేకల కేదారి యాదవ్



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 90 రోజుల్లోనే గొర్రెల స్కీమును అమలు చేస్తామని గొల్ల కురుమల తరపున మేనిఫెస్టోలో పెట్టి ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తడం లేదని ఉమ్మడి వరంగల్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల సమాఖ్య మాజీ చైర్మన్ మేకల కేదారి యాదవ్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ఓట్లేస్తే గొల్ల కురుమలను ఓడ దాటే దాక ఓడ మల్లన్న ఓడ దాటిన తర్వాత బోడ మల్లన్న లాగా వ్యవహరించడం సరికాదన్నారు. కట్టిన డీడీలను పశు సంవర్ధక శాఖచే వెనక్కి ఇప్పించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల, కురుమలను మోసం చేసిందనిమేకల కేదారి యాదవ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా జనాభా ప్రకారం కాంగ్రెస్ పార్టీ వల్ల కురుమలకు టికెట్లు కేటాయించడంలో మోసం చేసిందన్నారు. ప్రభుత్వం వెంటనే పశుసంవర్ధక శాఖకు మంత్రిని నియమించాలని, ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల స్కీంను అమలు చేస్తారా లేదా బ్రేక్ చేస్తారా అనే విషయం ఈనెల 2న తెలంగాణ సంబరాలు జరిపే లోపు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తు కార్యాచరణను పొందించుకుంటామని మేకల కేదార్ యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## జూన్ 1న హనుమాన్ జయంతి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ వీరాంజనేయ స్వామి సాయిబాబా దేవస్థానంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ బుధవారం తెలిపింది. శనివారం ఉదయం ఐదు గంటల 30 నిమిషాలకు స్వామివారి అభిషేకం, 7 గంటలకు అర్చనలు చేయనున్నారు. ఉప్పుల కళావతి కుమారుడు పవన్ మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం నిర్వహించనున్నారు. భక్తులు వీరాంజనేయ స్వామి తీర్థప్రసాదాలు తీసుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈ ప్రకటనలో కమిటీ సభ్యులు కోరారు.

## అనాథాశ్రమంలో మంత్రి పెళ్లి రోజు వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మదర్ థెరిస్సా అనాథాశ్రమంలో మంత్రి కొండా సురేఖ-మురళీధర్ రావు దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సోమ లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్థానిక కాశిబుగ్గ ఓ సిటీలో గల మదర్ థెరిస్సా పిల్లల అనాథాశ్రమంలో అనాథ పిల్లలందరి సమక్షంలో కేక్ కట్ చేసి, పిల్లలకు కేక్, స్వీట్స్, చాక్లెట్స్, పండ్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో 13 వ డివిజన్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్స్ బొట్ల నితిన్, వరంగల్ తూర్పు సోషల్ మీడియా డివిజన్ కో ఆర్డినేటర్స్ రాజశేఖర్ నేత, సంతోషిని, రాజేష్, వరంగల్ తూర్పు కాంగ్రెస్ నాయకులు బొట్ల ప్రసాద్, క్యాతం శ్రీనివాస్, అంకం రాజేష్ లతో పాటు మదర్ థెరిస్సా పిల్లల అనాథ ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారని సోమ లక్ష్మి తెలిపారు.

## భోజనం ప్యాకెట్ల పంపిణీ..



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్యదర్శి జక్కోజు బీమా చారి, 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి రాజేష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ-మురళీధర్ రావు దంపతుల పెళ్లిరోజు సందర్భాన్ని పురస్కరించుకొని వరంగల్ రైల్వే స్టేషన్ లో, క్యాంప్ ఆఫీస్ దగ్గర ప్రజలకు భోజనం ప్యాకెట్లను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబి సాంబరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూచన రవీందర్, జంగం ప్రభాకర్, బట్టు శేషు, అన్నం శ్రీనివాస్, పాలకుర్తి హరిప్రసాద్, కిషోర్ బాబు, అనిల్, భరత్, వెంకన్న, మల్లేశం, కాంగ్రెస్ కార్యకర్తలు, కొండ అభిమానులు పాల్గొన్నారు.

## హనుమాన్ శోభాయాత్ర



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండలంలోని హనుమాన్ మాల వేసుకున్న స్వాములు మంగళవారం హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు హనుమాన్ శోభాయాత్ర ను గ్రామంలోని వీధి వీధి తిరుగుతూ సందడిగా హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తమండలి, స్వాములు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన వాకాటి కరుణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళ శిశు సంక్షేమం సెక్రెటరీ వాకాటి కరుణ వరంగల్ కాకతీయ యూనివర్సిటీ సందర్శన సందర్భంగా హనుమకొండ ప్రాజెక్టు పరిధిలోని వడ్డేపల్లి సెక్టార్ హౌసింగ్ బోర్డ్ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్వాడీ మొబైల్ కుటుంబ సర్వే గురించి, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ తీవ్ర లోపపోషణ అంగన్వాడీ కేంద్రం లో పిల్లలు ఎంతమంది ఉన్నారు, డేటా ప్రకారం అతి తీవ్ర లోప పోషణ, తక్కువ పోషణ ఎన్ ఎఫ్ హెచ్ఎస్ -5 ప్రకారం ప్రస్తుతం లోప పోషణ పిల్లలు సంఖ్య తగ్గిందా అని, అర్బన్ ఏరియా కారణంగా లోప పోషణ పిల్లల తక్కువగా ఉండవచ్చన్నారు. మొబైల్ లో కుటుంబ సభ్యుల పేర్లు ఆన్ లైన్ చేసేటప్పుడు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి



తెలుసుకున్నారు. పిల్లల బరువులు తీసేటప్పుడు ఎత్తు చూసేటప్పుడు ఖచ్చితంగా బరువు, ఎత్తు తీయమని తెలిపారు. లబ్ధిదారులు అందరూ తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో బరువు ఎత్తు తప్పకుండా ప్రతి నెల తీయడానికి తీసుకొని రావాలని, అంగన్వాడీ కేంద్రాలను కూడా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ కరుణ, ఆర్ జేడీ బి.ఝాన్సీ లక్ష్మీబాయి, జిల్లా సంక్షేమ అధికారి కే.మధురిమ, సూపర్ వైజర్స్ టి.కవిత, డి.రాజ్యలక్ష్మి, అంగన్వాడీ టీచర్స్ సరస్వతి, సునీత, ఆయా స్వప్న, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి పాల్గొన్నారు.

# ఈజీఎస్‌తో పండ్ల తోటల పెంపకం

## అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్న కారు రైతులకు హార్టికల్చర్ పంటలు మంజూరు కోసం రైతులకు అవగాహన కల్పించి ప్రతిపాదనలు సమర్పించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరకాల మండలానికి 70 ఎకరాలు మంజూరైందని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అస్టెంట్లు వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో గ్రామంలో సన్న, చిన్న కారు రైతులకు అవగాహన కల్పించి రెండు మూడు రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేసి మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులు చిన్న, సన్న కారు రైతు సర్టిఫికెట్, ఆధార్ కార్డు జాబ్ కార్డు, సెల్ ఫోన్ నెంబర్, పట్టా దారు పాస్ బుక్ జిరాక్స్ కాపీలు పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తుతో పాటు అందజేయాలన్నారు. ఈ పండ్లతోటల పెంపకానికి గాను రైతులకు రెండు సంవత్సరాల వరకు ఉపాధి హామీ ద్వారా మెయింటెనెన్స్ చార్జీలు, మొక్కలు ఖర్చు, గుంతలు తీయుటకు కూలీల ఖర్చు ఉపాధి హామీ ద్వారా చెల్లించడం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని సన్న చిన్న కారు రైతులు ఈ సదావకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఇమ్మడి భాస్కర్, ఏపీఓ ఇందిర, పంచాయతీ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఎన్సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక లాల్ బహదూర్ కళాశాలలో ఎన్సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం కార్యక్రమంలో ఎన్సీసీ పదో తెలంగాణ బెటాలియన్ ఆర్మీ విభాగం అధికారులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునహరే మాట్లాడారు. 286 అబ్బాయిలకు, అమ్మాయిలకు ఎన్ సీసీ బీ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. త్రివిధ దళాలలో ప్రత్యేక రిజర్వేషన్, మెడికల్, ఇంజినీరింగ్ వంటి వాటిలో ఉన్నత విద్య కోసం ఎంత ఉపయోగపడతాయని దేశభద్రతలో, జాతీయ సమగ్రతలో ఎన్సీసీ కేడెట్స్ రోల్ మోడల్ చాలా ముఖ్యమని, దేశంలో యువతకు ఎన్సీసీ కాడెట్స్ ఆదర్శంగా ఉండాలన్నారు. ఆర్మీలో చేరేందుకు పునాదిగా ఎన్సీసీ పనిచేస్తుందని, ఈ సర్టిఫికేట్ ప్రభుత్వ పోలీసు ఆర్మీ త్రివిధ దళాలలో ఉద్యోగ అవకాశాలకు మొదటి ప్రాధాన్యం, రిజర్వేషన్ ఉంటుందని అడ్మినిస్ట్రేటివ్ అధికారి రవి సునహరే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ ఆఫీసర్స్ కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, సుబేదార్ మేజర్ రఫీ, జూనియర్ కమిషనర్ అధికారి సౌరస్య, లెఫ్టినెంట్ విష్ణువర్ధన్ రెడ్డి జీవన్ గౌడ్, కుమారస్వామి, బీహెచ్ఎం పీఐ స్టాఫ్ కళాశాల సెమినార్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో పాత వరంగల్ పూర్వ వరంగల్ జిల్లా నుంచి 10 డిగ్రీ కళాశాలలో బి సర్టిఫికెట్ పాస్ అయిన వాళ్లు ఈ సర్టిఫికెట్లు స్వీకరించారు.

## కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** స్థానిక పెద్ద చెరువులో మట్టి తీసేందుకు మాజీ ఎమ్మెల్యే చల్లాకు పర్మిషన్ ఉన్నప్పటికీ, కొందరు కావాలనే జేసీబీ, ట్రాక్టర్లను అడ్డుకొని రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో పూర్తిగా ఎండిపోయిన పెద్ద చెరువులో పూడిక తీత కోసం నల్ల రేగడి మట్టి తీయడాని పర్మిషన్ రాయల్టీ కట్టారని తెలిపారు. రైతుల బాగోగులు ఆలోచించకుండా కాంగ్రెస్ నాయకులు వాళ్ల స్వార్ధ రాజకీయాల కోసం ఆపడం జరిగిందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే చల్లాపై ఇలాంటి చిల్లర రాజకీయాలు సరికాదని బీఆర్ఎస్ నాయకులు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దుర్గెట్టి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు, మాజీ ఉపసర్పంచ్ కిన్నెరమని, బీఆర్ఎస్ అధ్యక్షుడు నారాయణ శ్రీనివాస్, కార్యదర్శి రావుల కిషన్, సింగిల్ విండో డైరెక్టర్ ఊర సతీష్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంఘాన్ని వేణు, వీరమల్ల మల్లారెడ్డి, ప్రభాకర్ రావు, ఎన్ రవీందర్, గోనెల శరత్, దుప్పటి మొగిలి, నాగవెల్లి శ్రీనివాస్, గోశాల రంజిత్, రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారికి వాకాటి కరుణ పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని వరంగల్ లోని కాకతీయ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా నియమితులైన ప్రభుత్వ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి వాకాటి కరుణ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వాకాటి కరుణకు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ భద్రకాళి శేషు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఆది శంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం అమ్మవారికి ప్రదక్షిణ చేసి ఆలయంలో ప్రవేశించే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజా అనంతరం ఆలయ మహా మండపంలో కరుణకు ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, సురేష్ శర్మ, దత్త సాహిత్ శర్మ, సంతోష్ శర్మ అమ్మవారి శేషవస్త్రాలు బహుకరించి ప్రసాదాలు అందజేశారు. ఆలయం చుట్టూ మాడవీధులు తదితర అభివృద్ధి కార్యక్రమాల విషయాన్ని అడిగి తెలుసుకుని తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## జూన్ 1న హనుమాన్ జయంతి

### దత్త క్షేత్రంలో చందన అభిషేకలు. వడ మాల సేవలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంజనీదేవి సుపుత్రుడు రామ భక్తుడు హనుమంతుడు స్వామీ జయంతిని పురస్కరించుకొని జూన్ 1 వ తేదీ శనివారం నగరంలోని శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్టు దత్త క్షేత్రం ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్ రావు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భక్తులు ప్రతి రోజు తమ కోరికలు నెరవేర్చుకోవడం కోసం దత్త క్షేత్రంలో శ్రీ కార్య సిద్ధి ఆంజనేయ స్వామీ వారికి పూర్ణ ఫలం సమర్పణ కొబ్బరి కాయ కట్టే సేవ జరుగుతుందని తెలిపారు హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి ఉత్సవ మూర్తికి భక్తులచే చందనం అభిషేకం జరుగునని, మూల మూర్తికి మధ్యాహ్నం 12గంటలకు తేనెతో ప్రత్యేక అభిషేకం పాల పంచ అమృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, వడ మాలలతో స్వామీకి అలంకరణ, పూర్ణ ఫలం సమర్పణ జరుగుతుందని తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరుగునని, స్వామీ వారికి నైవేద్యం మహా మంగళ హారతి జరుగునని పేర్కొన్నారు. అనంతరం భక్తులందరికి మహా అన్నదానం నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామీ వారి కృపకు పాత్రులు కాగలరని వామన్ రావు కోరారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** నకిలీ విత్తనాలు అమ్మినా, లేదా కొన్నా ఎమ్మార్పీ ధరల కంటే మించి అమ్మితే వారిపై తగు చర్యలు తప్పవని రేగొండ ఎస్సై ఎన్ రవికుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అగ్రికల్చర్ ఆఫీసర్ వాసుదేవ రెడ్డితో కలిసి ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవి కుమార్ మాట్లాడుతూ సీడ్స్ , ఫర్టిలైజర్ దుకాణాదారులు నకిలీ విత్తనాలు, పురుగుల మందు అమ్మవద్దని అమ్మినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులను, బిల్ బుక్కులను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులను ఎలాంటి విషయంలో మోసం చేసిన యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని, రైతులు కూడా అప్రమత్తంగా ఉండి వ్యవసాయ అధికారుల సలహా సూచనల ప్రకారం విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేశాక తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సిబ్బంది తదితరులకు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యుత్ అందించేందుకు కృషి

### టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలో 569 ఫీడర్లలో (ఆర్ టీడీఏఎస్ంఎస్ సీఏడీఏ) మానవ ప్రమేయం లేకుండా REAL TIME DATA ACQUISITION + SUPERVISIORY CONTROL AND DATA ACQUISITION డాటా ప్రకారం గత ఏడాది జనవరి నుంచి మే వరకు 11 కేవీ ట్రిప్పింగ్స్, 57771 ఉండగా ఈ ఏడాది 40724 నమోదయ్యాయని గత ఏడాదితో పోల్చుకుంటే 17047 తగ్గాయని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. 29.51 శాతం తగ్గిందని, అలాగే, గత ఏడాది జనవరి నుంచి మే వరకు 10558 గంటలు అంతరాయాలు ఉండగా ఈ ఏడాది 7262 గంటలు నమోదైందని, 3296 గంటల అంతరాయాల సమయాన్ని తగ్గించగలిగామని, 31.22 % తగ్గిందని తెలిపారు. ఇదంతా ముందస్తుగా చేపట్టిన ప్రీ మాన్సూన్ ఇన్స్పెక్షన్, లైన్ల నిర్వహణ, జంపర్లను, వంగిన పోల్ లను సరిచేస్తూ దాదాపు 200 ఫీడర్లపై కెపాసిటర్ బ్యాంకులను పెట్టడం, 530 ఫీడర్లలో పవర్ ఫాక్టర్ ను నిర్వహించడం వలన లోవోల్టేజి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకోవడం వలన సాధ్యమైందన్నారు . ప్రతి ఒక్కరూ నిబద్ధతో పనిచేస్తూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు. ఇక ముందు కూడా మరింత నాణ్యమైన, మెరుగైన విద్యుత్ అందించడానికి ఆహర్నిశలు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## డీవైఎస్ఓకు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలోని క్రీడా పాఠశాలలు, క్రీడా వసతి గృహాలు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షక కమిటీ సభ్యులుగా నియమితులైన హనుమకొండ జిల్లా క్రీడలు, యువజన అధికారి గుగులోతు అశోక్ ను క్రీడా శాఖ కోచ్ లు సన్మానించారు. బుధవారం స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో డీవైఎస్ఓను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు కూరపాటి రమేష్, నరేందర్, ప్రశాంత్, శ్రీమాన్ నారాయణ, అఫ్జల్, నవీన్, విష్ణు, దేవిక, రాజు, శంకర్, జీవన్, ప్రభు, దుబాసి నందకిషోర్, వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గోపాల స్వామి గుడి తోట మైదాన వాకర అసోసియేషన్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తులైన పిల్లలకు సహాయార్థంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమక్షంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ బసవరాజ్ కుమార్ స్వామి, 23వ డివిజన్ కాంగ్రెస్ నేత చిప్ప వెంకటేశ్వర్లు, ఎలుగం సత్యనారాయణ, గోపాల్ స్వామి వాకర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జయ ప్రకాష్, సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ పోరండ్ల సాంబయ్య, చల్ల కుమారస్వామి, ఏల్పుల అంజయ్య, పులి ప్రభాకర్, నూనె రాజేశం, జి.రాము, తోట సురేష్, చిప్ప అయిలయ్య, తోట రాము, సిరబోయిన రాజు, మూగ భాస్కర్, గంజి రాజు, చిగురుమామిడి ప్రభాకర్, నవీన్, ఏ.సుధాకర్, రాజు, కట్ట సంజీవ్, కిరణ్, మహిళా డోనర్లు నవ్య శ్రీ, మంజుల, రజిత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో 67 రక్త యూనిట్లు సేకరించినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలిపింది.

## ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల షాపులపై దాడులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మున్సిపాలిటీ మెడికల్ హెల్త్ డిపార్ట్ మెంట్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, వరంగల్, హనుమకొండ జిల్లాల వినియోగ దారుల సంఘాల సమాఖ్య అధ్వర్యంలో నిషేధిత ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల, స్ట్రాన్లు, కప్ లు, ట్రే లు మొదలైన వస్తువులు అమ్మే బట్టల బజార్ వరంగల్ వ్యాపారస్తుల దుకాణదారుల పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడులలో షణ్ముఖ, హనుమాన్, లేపాక్షి, సుధా, ఎస్ ఆర్, ఉత్తమ్, భవానీ, హరి ఓం, హరీష్ మొదలైన 12 దుకాణాలపై మునిసిపల్ అధికారి సంపత్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది సుభాస్ లు కేసులు, జరిమానాలు వేసి నిషేధిత అక్రమ సరుకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, కన్స్యూమర్ ఫోరం అధ్యక్షుడు, రాష్ట్ర క్యాట్కో ఉపాధ్యక్షుడు డాక్టర్ ఠాగూర్ రతన్ సింగ్, క్యాట్ కో రాష్ట్ర కార్యదర్శి వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్, కార్పొరేషన్ కన్వీనర్ కోడిమ్యాల శ్రీనివాస్ రావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మైస వసంత, విజిలెన్స్ కమిటీ మెంబర్లు నాగెల్లి సారంగం, బెజ్జంకీ ప్రభాకర్, సిటీ ఇంచార్జి సిలువేరు శ్రీనివాస్, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, రాజు 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

## మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య యత్నం

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని కొమ్మనపల్లి శివారు కపుర్యతండాకు చెందిన భీముడు మనస్థాపంతో పురుగుల మందు తాగి ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఉదయం కోమ్మనపల్లి శివారు కపుర్య తండాకు గుడుంబా తనిఖీల్లో భాగంగా వెళ్లగా తండాలోని భీముడు అనే వ్యక్తి ఇంటికి వెళ్లగా గుడుంబా దొరక లేదు. గతంలో భీముడిపై కేసు నమోదై ఉండడంతో మళ్లీ గుడుంబా అమ్ముతున్నావని బెదిరింపులకు గురిచేసి తనను అకారణంగా కొట్టారని అతడు ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు హాస్పిటల్ కి తరలించి చికిత్స అందిస్తున్నారు. భీముడిని అకారణంగా కొట్టినందుకు నిరసనగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ముందు నిరసన చేపట్టిన కపూర్య తండావాసులు ఉన్నతాధికారుల చొరవతో నిరసన విరమించుకున్నారు.

## ద్విచక్ర వాహనం చోరీ

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోనీ జ్యోతి బాపు నగర్ లో అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగుడు ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనం చోరీ చేశారు. బోడ కిషన్ ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారు జామున లేచి చూసేసరికి తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో చోరికి గురైందని భావించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల లో రికార్డ్ అయ్యాయి. ఇంటి ముందు నిలిచిన వాహనాలు వరుసగా అపహరణకు గురవడంతో వాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో పోలీస్ గస్తీని పెంచాలని ప్రజలు కోరుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాల ఆధారంగా విచారణ చేపట్టారు.

# మహారాజా చిత్రంలో.. విజయ్ సేతుపతి





పాన్ ఇండియా స్టార్ ఇమేజ్ ఉన్న తమిళ నటుల్లో టాప్‌లో ఉంటాడు విజయ్ సేతుపతి. తమిళం, హిందీ, కన్నడ, మలయాళం, తెలుగు భాల్లో ఓ వైపు హీరోగా.. మరోవైపు నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు. ఈ స్టార్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి మక్కళ్ సెల్వన్ 50 నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి మహారాజా టైటిల్‌తో వస్తోంది. తాజాగా ట్రైలర్ అప్‌డేట్ అందించింది మక్కళ్ సెల్వన్ టీం. నిరీక్షణ దాదాపు ముగిసిపోయింది. మహారాజా ట్రైలర్ రేపు సాయంత్రం 5 గంటలకు రాబోతుందని మేకర్స్ కొత్త పోస్టర్ ఒకటి షేర్ చేశారు మేకర్స్. ముఖంపై గాట్లతో ఉన్న విజయ్ సేతుపతి చేతిలో కత్తి పట్టుకొని స్టన్నింగ్‌గా కనిపిస్తూ సినిమా ట్రైలర్‌పై క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు.ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రక్తపు మరకలతో ఉన్న విజయ్ సేతుపతి చేతిలో కత్తి పట్టుకొని హెయిర్ సెలూన్ ఛైర్‌పై కూర్చున్నాడు. చెవికి పట్టీ కనిపిస్తుండగా.. పక్కనే పోలీసులు కూడా ఉన్నారు. అసలు ఏం జరిగిందనేది సస్పెన్స్‌లో పెట్టేసి సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు డైరెక్టర్. ప్యాషన్ స్టూడియోస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీలో బాలీవుడ్ దర్శకనిర్మాత అనురాగ్ కశ్యప్, మమతా మోహన్ దాస్, నట్టీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.

# తృప్తి డిమ్రీతో ఐటమ్ సాంగ్

## మరో సీరియల్ ఉంటుందంటూ టాక్







పుష్ప–2 చిత్రం విడుదలకు ముందే అనేక సంచలనాలు వస్తున్నాయి. ఈ చిత్రంలో పాటలు శ్రేయాఘోషాలు పాడగా.. ఐటమ్ సాంగ్ కోసం తృప్తి డిమ్రిని తీసుకుని వచ్చే ప్రయటత్నాలు సాగుతున్నాయని సమాచారం. మరో విశేషమేమంటే పార్ట్–3 కూడా ప్లాన్ చేస్తున్నారని టాక్. ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'పుష్ప 2'.. గతంలో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'పుష్ప' సినిమాకు సీక్వెల్ గా ఈ సినిమా తెరకెక్కుతుంది. మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉంటే ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగల్ రిలీజ్ చేశారు. పుష్ప.. పుష్ప.. అంటూ సాగే ఈ పాట ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుంది. ఏకంగా 100 మిలియన్ వ్యూస్ సాధించింది. ఇదిలా ఉంటే బుధవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగల్ రిలీజ్ అయ్యింది. స్టార్ సింగర్ శ్రేయ ఘోషల్ పాడిన ఈ కపుల్ సాంగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది అని మేకర్స్ చెబుతున్నారు. అలాగే ఈ సినిమాలో అదిరిపోయే ఐటెం సాంగ్ కూడా ప్లాన చేస్తున్నారని టాక్ నడుస్తోంది. యానిమల్ బ్యూటీ తృప్తి డిమ్రి ఈ సాంగ్‌లో ఆడిపాడనున్నారని వార్తలు వస్తున్నాయి. త్వరలోనే సుకుమార్ ఈ పాటను కూడా షూట్ చేసే అవకాశం ఉంది.అల్లు అర్జున సరసన రష్మిక మందన్నా నటిస్తోన్న ఈ చిత్రంలో ఫవాద్ ఫాజిల్, సునీల్, అనసూయ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

### సూసేకి అగ్గిరవ్వ పాట విడుదల..

ఇప్పటికే విడుదలైన 'గ్లింప్స్, టీజర్, పుష్ప పుష్ప సాంగ్' యూట్యూబ్‌లో ఆల్ టైమ్ రికార్డులను నెలకొల్పగా.. ఇప్పుడు మరో ట్రీట్ ఇచ్చారు మేకర్స్. 'పుష్ప 2: ది రూల్' నుంచి కపుల్ సాంగ్ 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి వుంటాదే నా సామి' లిరికల్ సాంగ్‌ను మేకర్స్ వదిలారు. ఈ పాటకు సంబంధించి ఇప్పటికే విడుదల చేసిన చిన్న ప్రోమో ఎలా వైరల్ అయిందో తెలిసిందే. మేకింగ్ విజువల్స్‌తో వచ్చిన ఈ కపుల్ సాంగ్.. 'నా సామి' పాటను బీట్ చేసేలా రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కంపోజ్ చేశారు. అంతకుమించి అనేలా ఆస్కార్ విజేత చంద్రబోస్ సాహిత్యం అందించారు. అద్భుతమైన సాహిత్యంతో వచ్చిన ఈ పాటను 5 భాషల్లోనూ ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ పాడటం మరో విశేషం. ఈ పాట మేకింగ్ విజువల్స్ చూస్తుంటే.. ఐ ఫీస్ట్ అన్నట్లుగా ఉంది. అల్లు అర్జున్, రష్మికా మందన్నా మరోసారి తమ డ్యాన్స్‌తో దుమ్మురేపారనేది అర్థమవుతోంది. ఈ పాటతో 'పుష్ప 2: ది రూల్'పై క్రేజ్ డబులైంది. పుష్ప 2: ది రూల్'తో మరోసారి ప్రపంచంలోని సినిమా అభిమానులంతా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటవిశ్వరూపాన్ని చూడబోతున్నారు.




## 'మహారాజ్ఞి'గా వస్తోన్న కాజోల్

బాలీవుడ్ నటి కాజోల్ కీలక పాత్రలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'మహారాజ్ఞి'. చరణ్‌తేజ్ ఉప్పల పాటి దర్శకుడు. ప్రభుదేవా, సంయుక్త, నసీరుద్దీషా, జిషుసేన్ గుప్త, ఆదిత్య సీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం ఈ చిత్ర టీజర్ విడుదలైంది. సినిమాకు సంబంధించిన పాత్రలను పరిచయం చేస్తూ విడుదల చేసిన ఈ టీజర్‌లో కాజోల్ యాక్షన్‌తో అదరగొట్టారు. హిందీతో పాటు, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

## రేవ్ పార్టీ కేసులో నటి హేమకు మరోమారు నోటీసులు



టాలీవుడ్ నటి హేమకు బెంగళూరు పోలీసులు మరోసారి నోటీసులు పంపారు. రేవ్ పార్టీ కేసులో జూన్ 1న విచారణకు హాజరుకావాలంటూ సీసీబీ (అఃః) నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే మే 27 న వైరల్ ఫీవర్ వల్ల తాను విచారణకు రాలేనంటూ, కొంత సమయం కావాలని కోరుతూ బెంగుళూరు పోలీసులకు లేఖ రాసింది హేమ. దానిని పరిగణలోకి తీసుకున్న పోలీసులు మరోసారి హేమకు నోటీసులు జారీ చేశారు. మరి ఈసారి హేమ ఎలా స్పందిస్తారో చూడాలి. బెంగళూరులో జరిగిన ఓ రేవ్ పార్టీలో పలువురు సెలబ్రిటీలతోపాటు నటి హేమ కూడా ఉందని టాక్ రావడంతో ఎలర్ట్ అయిన హేమ ఓ ఫేక్ వీడియో రిలీజ్ చేసి హైదరాబాద్‌లోనే ఓ ఫామ్‌హౌస్‌లో చిల్ అవుతున్నాని తెలిపింది. అయితే అక్కడున్న వారిలో హేమ కూడా ఉందని మాదక ద్రవ్యాలు సేవించిందని ఆ సాయంత్రానికే పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు ఆమెను విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసిన సంగతి విధితమే!

# సేవాలాల్ మార్గం అనుసరనీయం

**ఆయన దీవెనలు రాష్ట్ర ప్రజల మీద ఉండాలి**

**రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**



**వరంగల్ వాయిస్, హైదారాబాద్ :** హైదారాబాద్ లోని కొంపెల్లిలో ఉన్న సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ బుధవారం దర్శించుకున్నారు. ఆయన దీవెనలు రాష్ట్ర ప్రజలపై ఉండాలన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ సేవాలాల్ మహారాజ్ సంఘ సంస్కర్తగా పని చేశారని కొనియాడారు. ఆయన పరమపదించి రెండు వందల సంవత్సరాలు దాటినప్పటికీ సేవాలాల్ మహారాజ్ ను దైవంగా భావిస్తున్నారంటే ఆయన చేసిన బోధనలు, అనుసరించిన మార్గం ఎంత గొప్పదో అర్ధం చేసుకోవచ్చన్నారు. అహింసా మార్గాన్ని అవలంభించాలని, అనర్ధాలకు కారణమయ్యే మద్యపానానికి దూరంగా ఉండాలని, మహిళలను గౌరవించాలని సేవాలాల్ చేసిన బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు సేవాలాల్ మహారాజ్ గొప్పతనం గురించి, ఆయన చేసిన బోధనలు భవిష్యత్ తరానికి సైతం అందేలా కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తెరిగి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తో పాటు పలువురు పార్టీ శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధి, వైఫల్యాలపై వ్యాసరచన పోటీ

**అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాష్ట్రం సాధించిన అభివృద్ధి, వైఫల్యాలపై అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్నారు. గత పది సంవత్సరాల్లో తెలంగాణ ఆకాంక్షలు ఏ మేరకు నెరవేరాయి అన్న అంశంపై రాష్ట్రంలోని 15 నుంచి 30 సంవత్సరాల మద్య వయసు కలిగిన యువతీ, యువకులు ఈ వ్యాసరచన పోటీలో పాల్గొనుటకు అర్హులని పేర్కొన్నారు. ఈ వ్యాసాలను పోస్టు ద్వారా మండల పరశు రాములు, అధ్యక్షులు అభ్యుదయ సేవా సమితి, ఉర్సు రోడ్, ఇంటి నెంబర్ 18-1-16, రంగసాయిపేట్ జిల్లా వరంగల్- 506 005 కి జూన్ 15వ తేదీ లోగా చేరేలా పంపించాలని కోరారు. విజేతలకు ఫస్ట్, సెకండ్, థర్డ్ బహుమతులు ఇవ్వనున్నట్లు మండల పరశురాములు తెలిపారు. ఇతర వివరాలకు 98492 08279 నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.

# నాణ్యతతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు

**కలెక్టర్ పి.ప్రావీణ్య క్షేత్ర స్థాయిలో తనిఖీలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మట్టేవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు ప్రభుత్వ ఇస్లామీయ పాఠశాల, క్రిస్టియన్ కాలనీ ప్రభుత్వ పాఠశాల, గ్రేయిన్ మార్కెట్ పాఠశాల, ఏనుమాముల మార్కెట్ వద్ద గల జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయిలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. నాణ్యతతో నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ద్వారా టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ఎంపికైన 459 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటికే అభివృద్ధి పనులు కొన్ని పాఠశాలల్లో పూర్తికాగా, మరికొన్ని పాఠశాలల్లో పెయింటింగ్ డ్యూయల్ డెస్క్ లు, త్వరితంగా గ్రీన్ చాక్ బోర్డులు, ఏర్పాటు జరిగేలా ప్రత్యేక అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. అంతకుముందు వరంగల్ శివనగర్ లోని తెలుగుతల్లి మహిళ సమాఖ్య ద్వారా నిర్వహిస్తున్న ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి వారు కుడుతున్న దుస్తులను పరిశీలించారు. ఇప్పటికే మహిళ సంఘాల ద్వారా 70 శాతం ఏకరూప దుస్తులను కుట్టించి సంబంధిత ప్రధానోపాధ్యాయులకు అందించడం జరిగిందని, జూన్ 10వ తేదీలోగా ఏకరుప దుస్తులు విద్యార్థులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు లక్ష 89 వేల 390 పాఠ్య పుస్తకాలు, 2 లక్షల 19 వేల 880 నోటు బుక్ లు ప్రభుత్వం అందాయని, వాటిని ప్రభుత్వ పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు అందజేయాలని డీఈవోను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో డీఈఓ వాసంతి, మెప్మా డిఎంసి రేణుక, ఈఈ శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు, ఎం ఈ ఓ, ఎం ఎన్ ఓ, టిఎల్ఎఫ్‌లు పాల్గొన్నారు.






# ధార్మిక భవనం ఆక్రమించేందుకు కుట్రలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వనదేవతలు సమ్మక్క, సారలమ్మ స్థలాన్ని భద్రకాళి దేవస్థానం అధికారులు ఆక్రమించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కోరాతూ మేడారంలో సమ్మక్క సారలమ్మ పూజారులు బుధవారం ఆలయం ప్రధాన గద్దెలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. సమ్మక్క-సారమ్మల గద్దెల ముఖ ద్వారం ఎదుట నల్ల బ్యాడ్జీలతో ధర్నా చేశారు. మేడారం నుంచి వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చే పూజారులు, అధికారులకు ఉపయోగకరంగా ఉండాలన్న ఆలోచనతో 1993 సంవత్సరంలో వరంగల్ సెంట్రల్ జైల్ ఎదురుగా 1014 గజాల స్థలాన్ని మేడారం ఆలయ సౌకర్యాల కోసం కేటాయించారు. అయితే ఇటీవల ఆ భూమిలో ధార్మిక భవనాన్ని నిర్మించారు. ఈ ధార్మిక భవనంలో దేవాదాయ శాఖ డీసీ, ఏసీ కార్యాలయాలతోపాటు మేడారం కార్యనిర్వహణ అధికారి కార్యాలయాలున్నాయి. అయితే భద్రకాళి ఆలయ అర్చకులు, అధికారులు వేద పాఠశాల పేరుతో ధార్మిక భవనాన్ని హస్తగతం చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపిస్తూ మేడారం సమ్మక్క, సారలమ్మ పూజారులు 29, 30 తేదీల్లో నిరసనకు పిలుపునిచ్చారు. అందులో భాగంగా అమ్మవారి గద్దెలకు తాళం వేసి ధర్నా నిర్వహించారు.

**మంత్రి హామీతో ధర్నా విరమణ..**

అమ్మల చెంత ధర్నా చేస్తున్న సమ్మక్క-సారలమ్మ పూజారులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ సీతక్క కలిసి చర్చించారు. వారి సమస్యను ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మేడారం పూజారులు, ఉద్యోగులకు ఉపయోగపడేలా జిల్లా కేంద్రంలో ఇచ్చిన భూమి వారికే చెందేలా కృషి చేస్తానన్నారు. ఇందులో భద్రకాళి దేవాలయానికి ఎటువంటి హక్కు లేదన్నారు. మంత్రి హామీతో పూజారులు ధర్నాను విరమించారు.



# రాష్ట్ర చిహ్నం మార్పుపై బీఆర్ఎస్ సీరియస్

**ఖిలాలో మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఆధ్వర్యంలో ధర్నా**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాకతీయుల కళ తోరణంతో కూడిన రాష్ట్ర చిహ్నంలో కాంగ్రెస్ ప్రభుత్వం మార్పులు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ వరంగల్ తూర్పు ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఖిలా వరంగల్ కాకతీయుల తోరణం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడతూ పాలనలో మార్పు తేలేని కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర చిహ్నం మార్పు పేరిట హడావిడి చేస్తున్నారని దుయ్యబట్టారు. కాకతీయ రాజుల కీర్తికి ప్రతీకగా నిలుస్తున్న కాకతీయ తోరణాన్ని రాష్ట్ర చిహ్నం నుంచి తొలగించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com